క్లుప్తంగా

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



లింగంపర్తిలో మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: ప్రస్తుత వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టినట్టు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి తెలిపారు. మండలంలోని లింగంపర్తిలో సోమవారం జేజేఎం నిధులతో మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి ఎంపీపీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. తాగునీటి కుళాయిలు, బోర్లకు మరమ్మతులు నిర్వహించామన్నారు. లింగంపర్తిలో తాగునీటి సమస్య పరిష్కారానికి వాటర్ ట్యాంక్ నిర్మిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఎస్‌జీవీ సుబ్బరాజు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జ్యోతుల పెదబాబు, పెంటకోట శ్రీధర్, నూకతాటి ఈశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

‘ఆదిత్య’కు బెస్ట్ స్టూడెంట్ చాప్టర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఇంజినీరింగ్ విభాగాధిపతి రామ్మోహన్‌రెడ్డి

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీకి బెస్ట్ స్టూడెంట్ చాప్టర్ అవార్డు లభించినట్టు ప్రో చాన్సలర్ ఎస్.సతీష్‌రెడ్డి తెలిపారు. ఇండియన్ కాంక్రీట్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో 2024లో నిర్వహించిన ఐసీఐ అల్ట్రా టెక్ అవార్డ్స్‌లో బెస్ట్ స్టూడెంట్ అవార్డ్ గెలుచుకున్నట్టు చెప్పారు. విశాఖలో మార్చి 28న జరిగిన పురస్కార ప్రదానోత్సవంలో ఐసీఐ కో ఆర్డినేటర్ ఎస్.గోవిందరాజన్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కో ఆర్డినేటర్ బి.రామ్‌సాగర్, విద్యార్థి ప్రతినిధులు పాల్గొనగా సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి బి.రామ్మోహన్‌రెడ్డి అవార్డును అందుకున్నట్టు వివరించారు. యూనివర్సిటీలో ఐసీఐ చాప్టర్‌కు సంబంధించి అనేక సాంకేతిక కార్యక్రమాలు, శిక్షణా శిబిరాలు, పరిశోధన కార్యక్రమాలు నిర్వహించడంతో ఈ అవార్డు వచ్చిందన్నారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గండేపల్లి: తాళ్లూరులో వేంచేసిన రామలింగేశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెట్ట ప్రాంతంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పండితులు స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. కాగా ఆలయంలోని చండీదుర్గా అమ్మవారికి వసంత నవరాత్రులు సందర్భంగా విశేష అర్చనలు, కుంకుమ పూజలు నిర్వహించారు.

గ్రామాల్లో సప్తాహాలు ప్రారంభం

కిర్లంపూడి: మండలంలోని జగపతినగరంలోని కొండయ్యపేట, చిల్లంగి గ్రామాల్లోని రామాలయాల్లో సోమవారం సప్తాహాలు ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పాల్గొని శ్రీరామునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సప్తాహ నిర్వాహకులు మాట్లాడుతూ 7 రోజుల పాటు నిర్వహించే భజన కార్యక్రమాల్లో స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భజన బృందాలు పాల్గొంటున్నాయని తెలిపారు. కొండయ్యపేటలో రామలయంలో భక్తులతో పాటు గిరిబాబు భజనలు చేశారు. ఆయన వెంట పెంటకోట నాగబాబు తదితరులు ఉన్నారు.

పేదలకు చేయూత

ప్రత్తిపాడు: రంజాన్ సందర్భంగా సోమవారం పీసీసీ సభ్యుడు ధరణాలకోట నిరుపేదలకు చేయూతనందించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పేద ముస్లిం కుటుంబాలకు బియ్యం, కూరగాయలు పంపిణీ చేశారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని గౌరంపేట సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు అన్నారు. మండలంలోని గౌరంపేటలో సోమవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏసుబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

1400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురంలో సారా స్థావరాలపై సోమవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఎక్సైజ్‌శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక సీఐ వెంకటలక్ష్మి తన సిబ్బంది పెరుమాళ్లపురంలో దాడి చేశారు. సారా తయారీకి సిద్ధం చేసిన 1400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అలాగే 10 లీటర్ల సారాతో వ్యక్తిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ముగిసిన ఉపవాస దీక్షలు



ఏలేశ్వరం ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



జగ్గంపేట మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, సీఐ శ్రీనివాస్



తునిలో నమాజ్ చేస్తున్న ముస్లింలు



కిర్లంపూడిలోని ముద్రగడ నివాసంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం మత పెద్దలు

తుని: రంజాన్ (ఈద్ ఉల్ ఫితర్) వేడుకలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో సోమవారం ఘనంగా జరిగాయి. నెల రోజులుగా ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు మసీదుల వద్ద సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మతపెద్దలు ఖురాన్ చదివి వినిపించారు. స్థానిక జామియా మసీదుతో పాటు జాతీయ రహదారి ఆనుకుని ఉన్న దర్గాలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. ఇమామ్ ఆధ్వర్యంలో నమాజు చేసి ఉపవాస దీక్షను విరమించారు. పేదలకు దానాలు చేశారు.

ఏలేశ్వరం: రంజాన్ వేడుకలు ప్రత్తిపాడు నియోజకవర్గంలో సోమవారం ఘనంగా జరిగాయి. ముస్లింలు ఈద్-ఉల్-ఫితర్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నెలరోజుల పాటు చేసిన ఉపవాసాలు ముగియడంతో స్థానిక నర్సీపట్నంరోడ్‌లోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక మార్కెట్‌వీధిలోని మసీదును విద్యుత్‌దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ముస్లింలు మసీదు వద్దకు చేరుకుని ఒకరికిఒకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. దీంతో ఆప్రాంతమంతా పండగ వాతావరణం నెలకొంది. ముస్లింలు నూతన వస్త్రాలు ధరించి బంధువులు, స్నేహితులు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

జగ్గంపేట: పవిత్ర రంజాన్‌ను పురస్కరించుకుని సోమవారం స్థానిక మసీదులో ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. మండలంలోని సుమారు 300 మంది ముస్లింలు ప్రార్థనలకు హాజరయ్యారు. జగ్గంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వైఆర్‌కే శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ అధ్యక్షులు గఫూర్, జగ్గంపేట జామా మసీద్ అధ్యక్షుడు ఆరీఫ్, ప్రముఖులు షేక్ రెహమాన్, చిన్న ఖాజా తదితరులు పాల్గొన్నారు.

గోకవరం: మండలంలోని ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించారు. స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని జామా మసీదు, విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలోని జామియా మసీదుల్లో ఉదయం నుంచి ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు ఈద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లింలు నూతన వస్త్రాలు ధరించి సందడి చేశారు.

ముస్లింలకు ముద్రగడ అల్పాహారం

కిర్లంపూడి: పవిత్ర రంజాన్ మాసం ముగింపును పురస్కరించుకుని కిర్లంపూడిలో ముస్లిం సోదరులకు ముద్రగడ నివాసంలో సోమవారం అల్పాహారం అందజేశారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ముస్లిం సోదరులను ఆత్మీయ ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆరోగ్యం, రాజకీయ అభివృద్ధి కోసం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహమ్మద్ షాబుద్దీన్, మహమ్మద్ ఖయ్యుం భాష, ఎస్కే కాలేషా, షరీఫ్ సాబ్, ఇబ్రహీం, బషీర్, ఎస్‌కే కాజా తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి భక్తిజ్ఞాన వేదాంత మహాసభలు

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురం చిద్గగానంద గీతాశ్రమంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు 51వ భక్తిజ్ఞాన వేదాంత మహాసభలు నిర్వహించనున్నారు. విజయనగరం జిల్లా గంగచోళ్లపెంట జ్ఞానానంద గీతాశ్రమం పీఠాధిపతి యోగానంద భారతీస్వామి ఆధ్వర్యంలో జరిగే ఈ మహాసభలకు పలు ఆశ్రమాల నుంచి పీఠాధిపతులు హాజరుకానున్నారు. మేడపాడు గీతాశ్రమం పీఠాధిపతి కృష్ణానందగిరిస్వామి, శంకరానందగిరిస్వామి, లక్ష్మీనర్సాపురం ఆశ్రమం నుంచి సూర్యనందగిరి, రమణమహర్షి ఆశ్రమం నుంచి రామానందస్వామి, శ్రీహరిక్షేత్రం పరమనందగిరి స్వాములు వేదాంత మహాసభల్లో అధ్యాత్మిక ప్రసంగం చేస్తారు. మహా సభల్లో భాగంగా ప్రతిరోజు ప్రణోవపాశన, సూర్యనమస్కారాలు, భజనలు, గీతాపారాయణం, యజ్ఞాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పీఠాధిపతి యోగానందా భారతీస్వామి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలి



హెచ్.కొత్తూరులో ఉపాధి కూలీల సమస్యలను తెలుసుకుంటున్న సీఐటీయూ నాయకుడు శ్రీనివాస్

తుని రూరల్: నెలలు తరబడి కష్టపడి పని చేస్తున్నా కూలి డబ్బులు చెల్లించకపోవడంపై సీఐటీయూ మండల ప్రెసిడెంట్, కార్మిక సంఘం నాయకుడు నక్కెళ్ల శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం తుని మండలం హెచ్.కొత్తూరులో పర్యటించి ఉపాధి హామీ కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జనవరి రెండో వారం నుంచి ఉపాధి డబ్బులు ప్రభుత్వం చెల్లించలేదని, అప్పులు చేసుకుని బతుకుతున్నట్టు కూలీలు తెలిపారు. మండుటెండలో పనులు చేస్తున్నా తాగునీరు, వడదెబ్బ నుంచి రక్షణకు చర్యలు తీసుకోలేదన్నారు. వేసవిలో అదనపు అలవెన్సులు నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకువెళ్తామని శ్రీనివాస్ హామీ ఇచ్చారు. వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించి వేతనాలు చెల్లించకపోతే ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



కిర్లంపూడిలో ముద్రగడ గిరిబాబును కలసిన వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి: పార్టీ బలోపేతానికి నూతన ఉత్తేజంతో పని చేయాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు. పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గం గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు రామిశెట్టి దొరబాబు, లీగల్‌సెల్ అధ్యక్షులు పలివెల నాగేంద్ర, వలంటీర్స్ వింగ్ అధ్యక్షులు దేవా లక్షణ్, పలువురు నాయకులు కిర్లంపూడిలోని ముద్రగడ నివాసంలో గిరిబాబును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. అనంతరం వారిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో మహిళలకు 2004-05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మగువలు పెట్టిన రంగురంగుల ముగ్గులు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సీనియర్స్ విభాగంలో జువ్వల హేమ, బావిశెట్టి సత్య, జువ్వల వీరమణి, జూనియర్స్ విభాగంలో మొగలి సురేఖ, గొంతిన బిందు మాధవి, గళ్లా రమ్య వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కై వసం చేసుకున్నారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా పుణ్యమంతుల శ్యామల, చింతలపూడి లహరి వ్యవహరించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పుణ్యమంతుల కామరాజు, సొసైటీ మాజీ అధ్యక్షుడు జున్యం చినబాబు, ఆదర్శ విద్యాలయ అధినేతలు దాడి చిన్నారావు, దాడి వెంకటరమణ, జ్ఞాన మండలి అధ్యక్షుడు దొడ్డిపట్ల సోమన్నదొర తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు పట్టుచీరల పంపిణీ



మహిళలకు పట్టుచీరలు పంపిణీ చేస్తున్న కంబాల శ్రీనివాస్‌రావు

గోకవరం: గ్రామదేవత గుబ్బాలమ్మ జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాస్‌రావు మహిళలకు ఉచితంగా పట్టుచీరలు పంపిణీ చేశారు. జాతరను పురస్కరించుకుని మహిళలకు లక్కీడ్రా ద్వారా చీరలు పంపిణీ చేస్తామని ప్రకటించగా సుమారు 2 వేల మంది పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి లక్కీడ్రా ద్వారా గెలుపొందిన 500 మంది మహిళలకు ఆయన పట్టుచీరలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, రామసేన సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో చలివేంద్రాలు ప్రారంభం

కోటనందూరు: మండలంలోని భీమవరపుకోటలో వైష్ణవి ఆగ్రో ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పెంటకోట భాస్కరసత్యనారాయణ సోమవారం ప్రారంభించారు. వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆగ్రో ఇండస్ట్రీస్ అధినేత పోపూరి రాజారావు తెలిపారు. తాండవ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ మేడపురెడ్డి జోగిబాబు, చింతకాయల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి అడ్డురోడ్డు సమీపంలో సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. స్థానిక లక్ష్మీదేవి ఆలయ నిర్వాహకురాలు మేడిశెట్టి రమణమ్మ తన సొంత నిధులతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులు, బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచిన రమణమ్మను పలువురు అభినందించారు.

సత్యదేవుని సన్నిధిలో మంత్రి పూజలు

అన్నవరం: రాష్ట్ర మున్సిపల్, పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పులవర్తి రామాంజనేయులు సోమవారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదాలను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు అందజేశారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ వేగవంతం చేయాలి

- రోడ్డెక్కిన క్రైస్తవ సంఘాలు
- గ్రామాలు, పట్టణాల్లో శాంతియుత ర్యాలీలు



తుని జీఎన్‌టీ రోడ్డులో శాంతి ర్యాలీకి తరలివచ్చిన క్రైస్తవులు



అన్నవరంలో శాంతి ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

తుని: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై విచారణను వేగవంతం చేయాలని క్రైస్తవ సంఘాలు డిమాండ్ చేశాయి. పట్టణంలో సోమవారం తుని, పాయకరావుపేట పట్టణాలకు చెందిన క్రైస్తవులు పెద్ద సంఖ్యలో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక జీఎన్‌టీ రోడ్డు ఎల్‌ఐసీ బిల్డింగ్ సెంటర్ నుంచి గొల్ల అప్పారావు సెంటర్ వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా నాసా సంస్థల అధినేత నూతలపాటి సోనివుడ్, అంబేడ్కర్ ఇండియా మిషన్ జిల్లా కో ఆర్డినేటర్ కె.దిలీప్ కుమార్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్‌ది యాక్సిడెంట్ కాదని దారుణంగా హత్య చేశారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కేసు విచారణలో ఎందుకు జాప్యం చేస్తోందో ప్రజలకు చెప్పాలన్నారు. సమగ్ర విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ప్లకార్డులతో భారీ ర్యాలీ చేయడంతో పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పాస్టర్లు యోహాన్, ఎస్.సాల్మన్ రాజు, నక్కా జాన్ ఆనంద్, నరేంద్ర, ప్రసాదబాబు, రాజబాబు, కిశోర్, పిలిఫ్, లాజరస్, బోడపాటి శ్రీను, తుని, కోటనందూరు, తొండంగి మండలాలతో పాటు తుని పట్టణం, పాయకరావుపేటకు చెందిన క్రైస్తవులు పాల్గొన్నారు.

అన్నవరం: పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై విచారణ చేసి నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం అన్నవరంలో క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక పెంతెకోస్తు చర్చి నుంచి క్రైస్తవులు ర్యాలీగా బయలుదేరి రావిచెట్టు సెంటర్ మీదుగా మెయిన్‌రోడ్ వద్దకు చేరుకున్నారు. పాస్టర్ ప్రవీణ్ మృతిపై తమకు అనుమానాలు ఉన్నందున పోలీసులు విచారణ వేగవంతం చేయాలని కోరారు. అన్నవరం పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు బి.యేసుదాసు, ఎస్.సుందరరావు, డేవిడ్, రాయి శ్రీనివాసరావు, తాడి సింహాచలం, సికోలు నాని, రాయి మోషె తదితరులు పాల్గొన్నారు.

గోకవరం: ఇటీవల మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ సోమవారం మండలంలోని రంపయర్రంపాలెంలో క్రైస్తవ సంఘాల సభ్యులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ సంఘాల నేతలు మాట్లాడుతు ప్రవీణ్ పగడాల సమానత్వం కోసం పోరాటం చేశారన్నారు. ఆయన మృతిపై ప్రభుత్వం విచారణను వేగవంతం చేసి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



రంపయర్రంపాలెంలో క్రైస్తవుల నిరసన ర్యాలీ

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

తుని: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని దళిత బహుజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సుప్రీం కోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రవీణ్ పగడాలది రోడ్డు ప్రమాదం కాదని, ముందస్తు ప్రణాళిక ప్రకారం జరిగిన హత్య అని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ బృందం పారదర్శకంగా విచారణ జరపడం లేదని, ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోనే అంతా జరుగుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పెద్దల హస్తం ఉన్నందున్న హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి రావడంతో పాటు ప్రవీణ్ పగడాల కుటుంబానికి న్యాయం జరుగుతుందని కృష్ణ స్వరూప్ పేర్కొన్నారు.

జాతరలో ఇరు వర్గాల ఘర్షణ

గోకవరం: మండలంలో కొత్తపల్లి గ్రామంలో నూకాలమ్మ జాతరలో ఆదివారం రాత్రి రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. జాతరలో ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ దాడిని గుర్తించిన పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులపై సైతం వారు దాడికి దిగారు. ఈ దాడిలో పోలీసు సిబ్బంది తీవ్రంగా గాయపడినట్టు తెలిసింది. దాడికి ప్రేమ వ్యవహారమే కారణమని స్థానికులు చెబుతున్నారు. దీనిపై ఎస్సై పవన్‌కుమార్‌ని వివరణ కోరగా జాతరలో ఇరు వర్గాల మధ్య దాడి జరిగిన మాట వాస్తవమేనన్నారు. అడ్డుకున్న పోలీసులకు స్వల్పగాయాలయ్యాయని, ఘటనపై కేసు నమోదు చేశామన్నారు.

అన్నమయ్య కళాక్షేత్రం ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల కన్వీనర్‌గా సానా



ప్రత్తిపాడు రూరల్: అన్నమయ్య కళాక్షేత్రం ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల కన్వీనర్‌గా మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన రంగస్థల నాటక కళాకారుడు సానా నూకరాజు నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు తిరుపతి అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి నుంచి నూకరాజుకు ఉత్తర్వులు అందాయి. మే 12న అన్నమయ్య జయంతిని పురస్కరించుకొని ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఉత్సవాలను నిర్వహించేందుకు కృషి చేయాలని పీఠాధిపతి విజయశంకరస్వామి సూచించారు. నూకరాజు నాయుడికు పలువురు కళాకారులు, గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

కాలినడకన భద్రాద్రికి పయనం



భద్రాద్రికి పాదయాత్రగా వెళ్తున్న ఏలూరు గ్రామ రైతులు

ప్రత్తిపాడు: మండలంలోని ఏలూరు గ్రామానికి చెందిన 15 మంది రైతులు భద్రాద్రికి కాలినడకన సోమవారం బయలుదేరారు. ఏటా సీతారాముల కల్యాణానికి రైతులు పాదయాత్రగా వెళ్లడం అనవాయితీ. పాదయాత్ర వల్ల పంటలు బాగా పండుతాయని, ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారని రైతులు తెలిపారు. కార్యక్రమంలో కొట్టేటి నాని, గంటా బాబ్జి, సత్యంశెట్టి సాయి, రాము, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మురళీ కృష్ణకు అభినందనలు



మురళీ కృష్ణకు అభినందనలు తెలుపుతున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

తొండంగి: విద్యుత్‌శాఖ తొండంగి సెక్షన్ సీనియర్ లైన్‌ఇన్‌స్పెక్టర్ మురళీ కృష్ణకు యూనియన్ సభ్యులు సోమవారం అభినందనలు తెలిపారు. ఆయన తుని రూరల్ నుంచి ప్రమోషన్‌పై తొండంగి వచ్చారు. ఈ నేపథ్యంలో విద్యుత్ శాఖ ఏఈ లోవరాజు, లైన్‌ఇనస్పెక్టర్లు, లైన్‌మెన్లు, యూనియన్ సభ్యులు ఆయనకు సత్కరించారు. కార్యక్రమంలో లైన్‌ఇనస్పెక్టర్లు ప్రసాద్, శ్రీను, లైన్‌మెన్లు కోటాన రాంబాబు, రాజు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఎన్యూమరేటర్లకు శిక్షణ

కిర్లంపూడి: మండలంలోని జగపతినగరం, సోమవరం, గెద్దనాపల్లి క్లస్టర్లలో మహిళా ఎన్యూమరేటర్లకు వార్షిక రుణ, జీవనోపాధుల ప్రణాళికలపై సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమాలను ఏపీఎం ఎస్. వేదకుమారి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 2092 సంఘాలకు 418 మంది మహిళా ఎన్యుమరేటర్లను నియమించినట్టు తెలిపారు. సంఘాలలోని సభ్యుల నెలవారి ఆర్థిక అవసరాలు గుర్తించి యాప్ ద్వారా డేటాను స్వీకరిస్తారన్నారు. సీసీలు ఎస్.బుల్లియ్య, ఎన్. శాంతి, వై.లోవరాజు, కె.సత్యప్రసాద్ శిక్షణ ఇచ్చారు.

దరఖాస్తులకు గడువు పెంపు

గోకవరం: మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాలల్లో ప్రవేశాల దరఖాస్తులకు ఈ నెల 6వ తేదీ వరకు గడువు పెంచినట్టు పాఠశాల ప్రిన్సిపల్ బి.రవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులకు ఈ నెల 25న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

మండల అధికారుల నంబర్లు

కోటనందూరు:

తహసీల్దార్	80088 03205
ఎంపీడీఓ	98496 63415
మండల వైద్యాధికారి	76750 32399
వ్యవసాయాధికారి	83310 56617
ఎంఈఓ-1	89856 02864
ఎంఈఓ-2	96529 81857
కోటనందూరు పశువైద్యాధికారి	86398 13895
పాతకొట్టాం పశువైద్యాధికారి	94919 34613